క్లుప్తంగా

రైల్వే ఉద్యోగుల గ్రీవెన్స్‌కు విశేష స్పందన



సమస్యలు వివరిస్తున్న కార్మికులు

రామగుండం: రామగుండం రైల్వే వ్యాగన్ షెడ్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహించే ఉద్యోగులు తమ సమస్యలను సికింద్రాబాద్ డివిజన్ పర్సనల్ కార్యాలయం నుంచి వచ్చిన ఏపీవో జితేంద్ర దృష్టికి తీసుకెళ్లారు. పొత్కపల్లి, ఓదెల, పెద్దపల్లి, రాఘవపురం, రామగుండం, పెద్దంపేట, మంచిర్యాల సెక్షన్ల నుంచి ఉద్యోగులు తమ సమస్యలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకువచ్చేందుకు గ్రీవెన్స్ వేదికను వినియోగించుకున్నారు. సెక్షన్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు, ఎంప్లాయీస్ సంఘ్ సెక్రటరీ అజ్మీరా వీరన్ననాయక్, లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.రవి తదితరులు ఉద్యోగులకు, అధికారులకు మధ్యవర్తిత్వం వహించారు.

కార్మిక హక్కుల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: జిల్లాలోని కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఐఎన్‌టీయూసీ పని చేస్తుందని యూనియన్ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అతిపెద్ద కార్మిక సంఘంగా ఐఎన్టీయూసీ నిలిచిందన్నారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐఎన్టీయూసీ కట్టుబడి ఉందని తెలిపారు. అనంతరం జిల్లా ఐఎన్టీయూసీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

జిల్లా ఐఎన్టీయూసీ కార్యవర్గం..

జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడిగా భూమల్ల చందర్, ఉపాధ్యక్షులుగా నీరటి శంకర్, మేకల సతీశ్, ప్రధాన కార్యదర్శిగా వంగల విజయమోహన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలుగా వెంకటేశ్వర్లు, కనకయ్య, సమ్మిరెడ్డి, కొమురయ్య, కోశాధికారిగా సంగ సురేందర్, జాయింట్ సెక్రటరీలుగా నయీంపాషా, బొద్దున శ్రీనివాస్, జమీల్, కంది రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బొంతు ఆనంద్, మేకల సురేశ్, ఆంజనేయులు, శంకర్, శ్రీనివాస్, సెక్రటరీలుగా గోషిక రవి, యాకూబ్, అర్కుటి రాయమల్లు యాదవ్, సాగర్, వర్కింగ్ కమిటీ సభ్యులుగా సల్మాన్ పాషా, కొమ్ము శ్రావణ్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మేడే) పోరాటదీక్షా దినంగా జరపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు కోరారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం పార్టీ నేతలతో కలిసి ఆయన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు ఖాజా, చంద్రయ్య, సాగర్, అంజయ్య, లక్ష్మి, శారద, పర్శరాములు, ముస్తఫా, సుశీల, రవి, శంకర్, మల్లేశం ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు



జ్యోతినగర్: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రామగుండం మున్సిపల్ అధికారులు తమ సిబ్బందితో తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ మల్కాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో కొందరు అనుమతి లేకుండా నిర్మించిన నిర్మాణాలను శుక్రవారం తొలగించారు. మల్కాపూర్ 56, 57 సర్వే నంబర్ ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం తొలగించకపోవడంపై స్థానికులు చర్చించుకుంటున్నారు. కొన్నినెలలుగా 56, 57 సర్వే నంబర్‌లో నిర్మించిన ఓ అక్రమ నిర్మాణం విషయంపై మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ తొలగించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినులకు సన్మానం

గోదావరిఖనిటౌన్: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను జిల్లా నోడల్ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ కల్పన స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్‌లో శుక్రవారం సన్మానించారు.

లూజ్ వైర్లు, వంగిన విద్యుత్ స్తంభాలు

- రక్షణ లేని టాన్స్‌ఫార్మర్లతో భయాందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు



రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్



పక్కకు వంగిన విద్యుత్ స్తంభం

సుల్తానాబాద్‌రూరల్: ప్రమాదకరంగా మారిన లూజ్ వైర్లు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో సుల్తానాబాద్ మండలంలోని రైతులు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని మియాపూర్(పెర్కపల్లి) గ్రామాలతో పాటు ఇతర గ్రామాల పరిధిలో రైతుల వ్యవసాయ భూముల్లో వేసిన విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. అంతేగాక లూజ్ వైర్ల మధ్యలో కర్రసాయంతో వైర్లను నిలబెడుతుండగా, కొన్ని చోట్ల ఎలాంటి రక్షణ లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏదో రకంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందులో భాగంగా గత ఏప్రిల్‌లో వ్యాన్‌డ్రైవర్ రివర్స్ తీస్తుండగా వ్యవసాయ కూలీ గంగాధర్ వెనుక నుంచి రైట్ చెప్పే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన ఘటన కూడా ఉంది. లూజ్ వైర్లు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు జరగకుండా ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

ముందస్తు చర్యలేవి..

గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో వేసిన విద్యుత్ స్తంభాలు ఒకపక్కకు వంగగా, వైర్లు కిందికి వేలాడుతున్నారు. మరోవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేకపోయినప్పటికీ విద్యుత్ అధికారులు వాటిని క్రమబద్ధీకరించేందుకు ముందస్తు చర్యలు తీసువడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మరో పదిరోజుల్లో యాసంగి పంట కోతలు పూర్తిగా అయిపోతాయి. దీంతో విద్యుత్ అధికారులు లూజ్ వైర్లు, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను సరిచేస్తే రానున్న వానాఆకాలం పంటల సమయంలో ప్రమాదాలను నియంత్రించవచ్చని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చొరవ తీసుకోవాలని అన్నదాతులు కోరుతున్నారు.

లూజ్ లైన్లతో ఇబ్బంది



విద్యుత్ స్తంభాల లూజ్ లైన్లతో ఇబ్బంది పడుతున్నాం. వాటికి కింది నుంచి వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాక వరి ధాన్యం, గడ్డి కుప్పలు తరలించాలన్నా, వరి కోతలకు హార్వెస్టర్లు రావాలన్నా ఇబ్బందిగా ఉంది.

– మ్యాకల బుచ్చయ్య, మియాపూర్

రక్షణ చర్యలు చేపట్టాలి



పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు చేపట్టాలి. యాసంగి పంటలు పూర్తికాగానే లూజ్ వైర్లను, స్తంభాలను, అధికారులు సరి చేస్తే బాగుంటుంది. వానాకాలం వచ్చిందంటే పంటలు వేశాక వర్షాలు కురిసినప్పుడు వ్యవసాయ భూముల వద్దకు వెళ్తే విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. – మహేందర్, మియాపూర్

మలేరియా నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

పెద్దపల్లిరూరల్: జిల్లాలో మలేరియా వ్యాధిని నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి అన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లిలో మలేరియాపై వైద్యబృందంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఎలిగేడు: ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు మండల పరిధిలోని ధూళికట్ట, సుల్తాన్‌పూర్, ఎలిగేడు హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలోని గ్రామాల పరిధిలో మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

ముత్తారం: ముత్తారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. వైద్యాధికారి అమరేందర్‌రావు, సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అడవిశ్రీరాంపూర్ చౌరస్తా వరకు ర్యాలీ చేశారు.



పెద్దపల్లిరూరల్: ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

జూలపల్లి: మండల కేంద్రం వైద్యాధికారి సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల్లోని వెల్‌నెస్ సెంటర్లలో వైద్య సిబ్బంది మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జూలపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో వైద్యాధికారులు అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఓదెల: మండలంలోని కొలనూర్, ఓదెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో డాక్టర్లు శంజనేష్, షాబోద్దీన్ ర్యాలీ నిర్వహించారు.

కార్పొరేట్ జీఎంకు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని: ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ పర్చేజ్ జీఎం ఎం.సుబ్బారావును శుక్రవారం సన్మానించారు. ఇల్లెందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయనను సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఆర్జీ–1 ఇన్‌చార్జి జీఎం చంద్రశేఖర్, వెంకటరమణ, అడ్రియాల జీఎం నాగేశ్వర్‌రావు, క్వాలిటీ జీఎం బైద్య, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పోషకాహారం అందించడమే లక్ష్యం

రామగిరి: పిల్లలు, మహిళలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమే పోషణ్ అభియాన్ లక్ష్యమని డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి అన్నారు. మండలంలోని సెంటినరికాలనీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులకు సీమంతం, అన్నప్రాసన చేశారు. జడ్జి స్వప్నరాణి, స్త్రీశిశు సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు, సీడీపీవో పుష్పలత, ఎంపీడీవో శైలజారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అనిత, సరిత, స్వప్న, శారద పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ, న్యూమారేడుపాకలోని అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. అంగన్వాడీ ఈసీసీఈ డే ప్రోగ్రాంలో భాగంగా కాలనీ అల్లూరు, ఇందిరానగర్–2, అల్లూరు ఎస్టీ కాలనీ, న్యూమారేడుపాక అంగన్వాడీ కేంద్రాల్లో సీమంతం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు ఈసీసీఈ డే సెలబ్రేషన్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు.



రామగిరి: సీమంతం చేస్తున్న అధికారులు

సుల్తానాబాద్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారని పెద్దపల్లి సీడీపీవో కవిత అన్నారు. పట్టణంలోని స్వప్నకాలనీలో శుక్రవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్ వైజర్ స్వరూపరాణి, అంగన్వాడీ టీచర్లు

సంక్షిప్త వార్తలు

• పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

పెద్దపల్లిరూరల్: పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటామని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) మేనేజర్ వెంకటేశ్ అన్నారు. స్థానిక శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై ఆయన అవగాహన కల్పించారు. ఎఫ్‌సీఐ అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్‌తోపాటు విష్ణువర్ధన్, మహేందర్, సాయికల్యాణ్, తిరుపతి, మాజీ కౌన్సిలర్ భిక్షపతి, సూపర్‌వైజర్ అనిత పాల్గొన్నారు.

• రోజూ తాగునీటి సరఫరా

కోల్‌సిటీ: రామగుండం నగరంలో రోజూ తాగునీరు సరఫరా చేయడానికి ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీ తెలిపారు. తాగునీరు వృథా కాకుండా నల్లాలకు ఆన్–ఆఫ్ కంట్రోల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరుగా విద్యుత్ మోటార్లను తొలగించి సహకరించాలని కోరారు. కొద్ది రోజుల్లోనే పూర్తిస్థాయిలో రోజూ కనీసం 45 నిమిషాలపాటు తాగునీరు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

• నేడు భూభారతిపై సదస్సు

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లిలోని ఆర్‌ఆర్ గార్డెన్‌లో శనివారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజయ్య తెలిపారు. కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు హాజరవుతారని పేర్కొన్నారు.

• విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలి

రామగుండం: రామగుండం కార్పొరేషన్‌లో లింగాపూర్ గ్రామాన్ని విలీనం చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని శుక్రవారం గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఇరికిళ్ల శంకరయ్య, అర్కనపల్లి శ్రీనివాస్ ఎంపీడీవో బైరి వేణుమాధవ్‌కు వినతిపత్రం అందజేశారు.

• ఏం సాధించారని రజతోత్సవాలు

సుల్తానాబాద్: బీఆర్ఎస్ పార్టీ ఏం సాధించిందని రజతోత్సవాలు చేసుకుంటున్నారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

• గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం సాంబయ్యపల్లి శివారులోని గర్రెపల్లి చెరువులో గుర్తు తెలియని మహిళ(45) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం గుర్తు తెలియని మహిళ మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండగా జీన్స్ ప్యాంట్, ఒకదానిపై ఒకటిగా మూడు షర్టులు వేసుకొని ఉందని తెలిపారు. ఆమె ప్యాంటు జేబులో మధ్యప్రదేశ్‌కు చెందిన లేఖన్ సింగ్ పేరుతో కలిగిన పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన డెబిట్ కార్డు లభించింది. ఎవరైనా ఆచూకీ తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా ఎస్సై సెల్ 87126 56511కు సమాచారం అందించాలని కోరారు.

• మిస్సింగ్ కేసు నమోదు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లిగేట్ గ్రామానికి చెందిన రాపాల రఘు(37) గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని భార్య రాపాల స్వప్న శుక్రవారం ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

• ట్రేడ్ లైసెన్స్ కోసం ఫేక్ కాల్స్‌పై జాగ్రత్త

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ డబ్బులు చెల్లించాలని వస్తున్న కాల్స్ ఫేక్ అని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. అవి ఫేక్ కాల్స్ అని సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని, ప్రజలు నేరుగా కార్యాలయానికి వచ్చి పన్నులు చెల్లించి రసీదులు పొందాలని ఆయన సూచించారు.

• బేగంపేటలో జైబాపు, జై భీం, జై సంవిధాన్

రామగిరి: మండలంలోని బేగంపేటలో శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు.

28 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత తరగతులు

గోదావరిఖని: వేసవి సెలవుల్లో విద్యార్థుల కోసం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు 28వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు గోదావరిఖని సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ కిరణ్‌బాబు తెలిపారు. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సెల్ 98497 72512 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

గోదావరిఖనిటౌన్: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ బాల, బాలికల రాష్ట్రస్థాయి పోటీలు మే 2వ తేదీ నుంచి 4 వరకు జగిత్యాల జిల్లాలోని స్వామివివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బాషబోయిన వాసు తెలిపారు. ఎంపిక పోటీలు 27న ఉదయం 9గంటలకు గోదావరిఖని ప్రభుత్వ పీజీ అండ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ 28కి వాయిదా

మంథని: రాజీవ్ యువవికాసం పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి 28, 29 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. మొద ట 26వ తేదీ నుంచి 29వరకు నిర్ణయించగా అనివార్య కారణాలతో 28, 29కి మార్చినట్లు పేర్కొన్నారు. 28న స్టేట్ బ్యాంకు, 29న యూనియన్, కెనరా, టీజీబీ, కేడీసీసీ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, మిగిలిన బ్యాంకులకు ఇంటర్వ్యూలు ఉంటాయని కమిషనర్ పేర్కొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మంథని: పట్టణ ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేసింది. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా ఎల్లంకి వంశీధర్, జనరల్ సెక్రటరీగా కొట్టి రమేశ్, ట్రెజరర్‌గా రావికంటి మనోహర్ ప్రమాణ స్వీకారం చేశారు.

ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



నినాదాలు చేస్తున్న నాయకులు

గోదావరిఖని: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. జీడీకే–11గనిలో శుక్రవారం కార్మికులతో కలిసి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం మౌనం పాటించి మృతులకు నివాళి అర్పించారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చేనెల 20న జరిగే సమ్మెను సింగరేణి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, జెల్ల గజేంద్ర, బుగ్గారం శ్రీనివాసరావు, జంగాపల్లి మల్లేశ్, సూర మహేందర్, సమ్మయ్య, సీహెచ్ దేవేందర్, శివ, రణవేణి హరీశ్, కార్మికులు పాల్గొన్నారు.

భూభారతి చట్టంతో శాశ్వత పరిష్కారం

కాల్వశ్రీరాంపూర్: భూభారతి చట్టంతో రైతుల భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. భూభారతి చట్టంపై మండల కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామపాలన అధికారుల వ్యవస్థతో అన్నిసమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి సలహాలు, సూచనలు ఇవ్వాలని రైతులు, మేధావులు, రిటైడ్ రెవెన్యూ ఉద్యోగులు, ఉన్నతాధికారులకు సూచించారు. పెద్దపల్లి మ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ ధరణి సమస్యలకు భూభారతితో పరిష్కారమవుతాయన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ గ్రామాలకు చెందిన 82 మందికి రూ.82,09,512 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. 118 మందికి రూ.32,64,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆర్డీవో గంగయ్య, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్, తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సదయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు

నర్సింగ్ కాలేజీకి సింగరేణి స్థలం

- 4.20 ఎకరాలు కేటాయింపు

కోల్‌సిటీ: స్థానిక జీజీహెచ్ బోధనాస్పత్రికి అనుబంధంగా నిర్వహిస్తున్న ప్రభుత్వ బాలికల నర్సింగ్ కాలేజీకి కొత్త భవనం మంజూరైంది. దీని నిర్మాణం కోసం సింగరేణి స్థలం కేటాయించింది. స్థానిక ఎల్బీనగర్ మాతంగి కాంప్లెక్స్ ఎదుట ఖాళీ స్థలాన్ని నర్సింగ్ కాలేజీ కోసం కేటాయించారు. వాస్తవంగా నర్సింగ్ కాలేజీ, హాస్టల్ నిర్వహణకు సుమారు ఐదు ఎకరాలు అవసరం. ఇందుకోసం రెండు, మూడుచోట్ల అనుకూలమైన స్థలం కోసం పరిశీలించిన అధికారులు.. చివరికి మాతంగి కాంప్లెక్స్ ఎదుట 4.20 ఎకరాల ఖాళీ స్థలాన్ని కేటాయించడానికి నిర్ణయించారు. టెండరు పొందిన హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థ చెట్లను జేసీబీ ద్వారా తొలగించే పనులను శుక్రవారం ప్రారంభించింది.

భవన నిర్మాణానికి రూ.28కోట్లు..

బాలికల నర్సింగ్ కాలేజీతోపాటు హాస్టల్ భవన నిర్మాణం, ఫర్నిచర్‌తోపాటు ఇతర పరికరాలను సమకూర్చడానికి రూ.23 కోట్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఏడాదిలోగా పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారని సమాచారం. సకాలంలో పనులు పూర్తయితే వచ్చే ఏడాది కొత్త భవనంలోనే కాలేజీ, హాస్టల్ నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.



ఎల్బీనగర్‌లో స్థలాన్ని చదును చేస్తున్న కాంట్రాక్టు సంస్థ

తాత్కాలిక భవనంలో ఉక్కపోత..

నర్సింగ్ కాలేజీకి 60 సీట్లు కేటాయించగా, ఇందులో 58 మంది విద్యార్థినులు అడ్మిషన్ తీసుకున్నారు. గతేడాది తొలి విద్యాసంవత్సరం తరగతులను నిర్వహిస్తున్నారు. ఒక విద్యార్థిని తప్ప మిగితా అందరూ తరగతులకు హాజరవుతున్నారు. నర్సింగ్ కాలేజీకి అనువైన భవనం, హాస్టల్ లేక తొలుత ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహించారు. తర్వాత స్థానిక శారదానగర్ సింగరేణి సంస్థకు చెందిన బిల్డింగ్‌లో ప్రస్తుతం తాత్కాలికంగా నర్సింగ్ కాలేజీ, హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. ఇటీవల పెరిగిన ఎండ తీవ్రతకు నర్సింగ్ స్టూడెంట్స్, ఫ్యాకల్టీలు, సిబ్బంది ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొత్త భవనం త్వరగా పూర్తయితే ఇబ్బందులు తప్పుతాయంటున్నారు.

సింగరేణి వార్తలు

బొగ్గుబ్లాకులను సింగరేణికే కేటాయించాలి

గోదావరిఖని: రాష్ట్రంలోని గోదావరి పరివాహకం వెంట ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయం ప్రధాన గేట్ ఎదుట శుక్రవారం బైటాయించి ధర్నా నిర్వహించారు. కార్మికుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కార్మిక కుటుంబాలకు అధునాతన వైద్యం, రక్షిత మంచినీటి సరఫరా అందించాలన్నారు. సింగరేణి సంస్థ ఉనికికే పెను ప్రమాదంగా మారిన బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దన్నారు. కార్మికులకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటయ్యేలా హెల్త్‌కార్డు ఇవ్వాలన్నారు. రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్‌లోని కార్మిక కుటుంబాల అవసరాలకు తగిన రక్షిత మంచినీటి సరఫరా చేయాలన్నారు. ధర్నాలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి వడ్డేపల్లి శంకర్, చెరుకు ప్రభాకర్‌రెడ్డి, పింగిల్ సంపత్‌రెడ్డి, వెంకటేశ్, చెల్పూరి సతీశ్, మొదుంపల్లి రాజేశం, ఐ.సత్యం, బేతి చంద్రయ్య, పాషం శ్రీనివాస్‌రెడ్డి, చెల్కలపల్లి శ్రీనివాస్, రమేశ్, దూట శేషగిరి, వాసర్ల జోసెఫ్, జనగామ మల్లేశ్, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, దాసరి మల్లేశ్, బొగ్గుల సాయి పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న టీబీజీకేఎస్ శ్రేణులు

ఎస్ఎంఎస్ ప్లాంట్ సందర్శన

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఎస్ఎంఎస్ ప్లాంట్‌ను కార్పొరేట్ స్టోర్స్ జీఎం ఎలీషా శుక్రవారం సందర్శించారు. ఓసీపీ–1 సీహెచ్‌పీని పరిశీలించి ఎస్ఎంఎస్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్టోర్‌లో యంత్రాల విడిభాగాల నిర్వహణ విధానం, మెటీరియల్ అప్‌కీపింగ్ లాంటి విషయాలపై చర్చించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం పిట్ స్టోర్స్, ఎస్ఎంఎస్ ప్లాంట్‌లోని ట్రక్ వాహనాల పనితీరును పరిశీలించారు. స్టోర్స్ మెటీరియల్ ఇన్వెంటరీ తగ్గించాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏరియా ఇంజినీర్ వైవీ శేఖరబాబు, కాశీ విశ్వేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజినీర్ ఉదయభాస్కర్, ఎస్ఎంఎస్ ప్లాంట్ మేనేజర్ పి.శరవణన్ ఇతర అధికారులు ఉన్నారు.



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేట్ జీఎం ఎలీషా

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ, దిష్టిబొమ్మ దహనం



పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో..



రామగుండం: దిష్టిబొమ్మ దహనం

పెద్దపల్లిరూరల్/కమాన్‌పూర్/ధర్మారం/కాల్వశ్రీరాంపూర్/ఎలిగేడు/సుల్తానాబాద్‌రూరల్/యైటింక్లయిన్‌కాలనీ/పాలకుర్తి/రామగుండం: కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళి అర్పించారు. జర్నలిస్టులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు.



ధర్మారం: కొవ్వొత్తులతో ర్యాలీ